


# విజయనగరసామ్రాజ్య కాలం నాటి పరిపాలన విధానం

మాతృదేశం, మాతృ సంస్కృతి మరొక్క సారి విదేశీయుల దాడికి గురైనప్పుడు వారి నుంచి దాదాపు మూడువందల సంవత్సరముల కాలం పాటు కాపాడి రాజపుత్రులు అనంతరం **"హిందూ పద్ పాదు సాహి" సంకల్పనకు** ప్రయత్నించిన వారే విజయనగర చక్రవర్తులు. ఈ సామ్రాజ్యం **హరిహర బుక్కరాయలుచే 1336 లో స్థాపితమై**, సాలువ వంశానికి చెందిన **రెండవ దేవరాయల కాలంలో** విజయనగర సామ్రాజ్యంగా మారి **శ్రీకృష్ణదేవరాయుల కాలంలో** మహోన్నత స్థితికి చేరి **దక్షిణ సముద్రధీశ్వర సామ్రాజ్యంగా** వాసికెక్కింది. అయితే 1565 సంవత్సరంలో జరిగిన **"రాక్షసి తంగడి" యుద్ధం లేదా "తల్లికోట" యుద్ధం లేదా "బెన్నట్టి" యుద్ధం** విజయనగర సామ్రాజ్యానికి ఆశనిపాతం గా మారి తర్వాత ఏమాత్రం కోలుకోలేక **పెనుగొండ, చంద్రగిరి** కేంద్రాలుగా కొనసాగినప్పటికీ పూర్వవైభవము సంపాదించ లేక చరిత్ర కాలగర్భంలో కలిసిపోయింది.

**విజయనగర సామ్రాజ్య చరిత్రకు ఆధారాలు:** విజయనగర సామ్రాజ్యమును, వారి పరిపాలన గురించి తెలుసుకొనుటకు మనకు అనేక ఆధారములు లభించినవి.విజయనగర పాలకులు వేయించిన **మోటుపల్లి, మంగళగిరి మరియు పోరుమామిళ్ల శాసనాలతో** పాటు అనేక గ్రంథాలు మనకు వారిని గురించి విపులంగా తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. గంగాంబ రచించిన **"మధురా విజయం"**, తిరుమలాంబ రచించిన **"వరదాంబికా పరిణయం"**, రామభద్రాంబా రచించిన **"రఘు నాథ అభ్యుదయం"**, విద్యారణ్యుణి **"శంకర్ విజయం, సంగీత సారం"**, శ్రీకృష్ణదేవరాయల **"ఆముక్తమాల్యద"** లాంటి గ్రంథాలు విజయనగర చక్రవర్తుల గురించి తెలుసుకోవడానికి ఎంతో దోహద పడుతున్నాయి. అదేవిధంగా కన్నడ భాషలో విరచితమైన **ప్రభులింగలీల, శ్రీకృష్ణరాయబారం, జ్ఞానభాస్కర** గ్రంథాలు, **"కన్నడ కవిత్రయం"**గా **ప్రసిద్ధికెక్కిన చామరసు, తిమ్మన, రేమన్న**లతోపాటు **మాధవుడు, భాస్కరుడు, కోటీశ్వరుడు, బాహుబలి** మొదలగు వారి గ్రంథాలు మనకు సంపూర్ణ సమాచారం అందిస్తున్నాయి. వాటితో పాటు తమిళ భాషలో కూడా మనకు అనేక గ్రంథాలు లభ్యమవుతున్నాయి.

వాటిలో ముఖ్యమైనవి విలయ పుత్తూరు వ్రాసిన "**తమిళ భారతం**", తిరుమలైనాథ రచించిన "**చిదంబర పురాణము**", జ్ఞాన ప్రకాష్ దేశికర్ రచించిన "**తుంజీరప్ప**" లాంటి గ్రంథాలు కూడా విజయనగర పాలకుల గురించి తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

విజయనగర సామ్రాజ్యం మరియు వారి పరిపాలన గురించి తెలుసుకోవాలి అంటే తప్పనిసరిగా శ్రీకృష్ణదేవరాయలు గురించి తెలుసుకోక తప్పదు. ఎందుకంటే **విజయనగరసామ్రాజ్య పరిపాలనా పితామహుడి** గా చరిత్రకారులు అభివర్ణించారు. హరిహర, బుక్కరాయలు చేత స్థాపించబడిన విజయనగర సామ్రాజ్యం ,రెండవ దేవరాయలు కాలంలో కొంతవరకూ నిర్మితమైనప్పటికీ పరిపాలనస్థిరత్వం పొందడంలో విఫలమైంది. ఈ సందర్భంలో సింహాసనం అధిష్టించిన శ్రీకృష్ణదేవరాయలు అనేక దండయాత్రలు ద్వారా సామ్రాజ్య విస్తరణతో పాటు సామ్రాజ్య సుస్థిరతకు కూడా అనేక పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి **గొప్ప పరిపాలనాధకుడుగా, విజయనగర సామ్రాజ్య స్థాపకుడుగా, ఇంకనూ <u>యవన రాజ్య స్థాపకుడుగా</u>,** సాహిత్య రంగానికి చేసిన సేవలకు **సాహిత్య సమరాంగణ సార్వభౌముడు** మరియు **ఆంధ్రభోజుడు గా** అనేక బిరుదులను సాధించి అష్టదిగ్గజ కవులను పోషించి, తమిళ, కన్నడ భాషలతో పాటు తెలుగు సాహిత్యమును మరింత ఉన్నత స్థాయికి చేర్చి, పోషించి **దేశభాషలందు తెలుగు లెస్స** అని కొనియాడెను.

## <u>పాలనావిధానంలోని ముఖ్యలక్షణాలు</u>:

"**విజయనగర సామ్రాజ్యం భూస్వామ్య వ్యవస్థ పై ఆధారపడింది, ఆ వ్యవస్థకు చక్రవర్తి ఆభరణం లాంటి వాడు**" అని ప్రముఖ చరిత్రకారుడు **డాక్టర్ ఈశ్వరి ప్రసాద్** అభివర్ణించాడు.

## కేంద్ర ప్రభుత్వం ;

విజయనగరచక్రవర్తుల పాలన కేంద్రీకృతమైనది. దానికి అధిపతి చక్రవర్తి. చక్రవర్తి సర్వాధికారి. వంశపారంపర్యమైనది. పరిపాలన నిర్వహణలో, న్యాయ నిర్వహణలో, సైనిక నిర్వహణలో చక్రవర్తిదే తుది నిర్ణయం. అయితే విజయనగర చక్రవర్తులు నిరంకుశంగా వ్యవహరించగా మంత్రివర్గ సహచరుల సహాయ సహకారాలతో పాలించుట ద్వారా వారిని **ప్రాజ్ఞ నిరంకుశుశ పాలకులు** గా చెప్పవచ్చు. పూర్తిగా సైనికారాజ్యం అవడం చేత వారు నిరంతరము అప్రమత్తంగా ఉండి, నిరంతర నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేసేవారు. **ప్రభుత్వం, మరియు పరిపాలనలో సలహా ఇవ్వడానికి విజయనగర చక్రవర్తులు మంత్రివర్గాన్ని నియమించు- కొనేవారు**. మంత్రి వర్గ సభ్యులలో ముఖ్యులు **ప్రధాని ,ఉపప్రధాని,భాండాగారికుడు మరియు ధర్మాసనాధికారి** మొదలగు వారు . మంత్రివర్గ సభ్యులు అందరూ చక్రవర్తి చేత నియమించబడి ఆయన ఆజ్ఞానుసారం పదవిలో కొనసాగారు. అయితే ప్రతి ఒక్కరూ ధర్మచక్రవర్తులుగా పేరు పొందడానికి ప్రయత్నం చేశారు. మంత్రివర్గ సభ్యులు అందరికీ కూడా వారి **పరిపాలనలో సలహా ఇవ్వడానికి సంప్రతి అనే అధికారగణం** ఉండేది.

**పాలనావిభాగాలు:** పరిపాలనా సౌలభ్యం మరియు పరిపాలన వికేంద్రీకరణ కు విజయనగర సామ్రాజ్య పాలకులు తమ సామ్రాజ్యాన్ని **వివిధ పాలనా విభాగాలు** గా విభజించారు. అందులో **రాష్ట్రాలు లేదా రాజ్యం, సీమలు లేదా నాడులు, సమితులు లేదా స్థలములు మరియు గ్రామాలు** ముఖ్యమైన భాగాలుగా చెప్పవచ్చును.

**రాష్ట్రములు :** విజయనగర సామ్రాజ్యం నేటి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు విస్తరించబడింది. కావున వివిధ ప్రాంతాల్లో ఈ పరిపాలన విభాగాలనూ వివిధ పేర్లతో పిలిచేవారు. ఆంధ్రదేశములోని

రాష్ట్రాలను **రాజ్యములను** అనేవారు. రాజ్యమునకు **"దుర్గం"** కేంద్రంగా ఉండేది. అలాంటి దుర్గాలలో ముఖ్యమైనవి **పెనుగొండ, గుత్తి, కొండవీడు, చంద్రగిరి, ఉదయగిరి, గుర్రము కొండ** మొదలగునవి. రాష్ట్ర అధిపతులను **"రాజప్రతినిధి" లేదా "నాయకుడి"గా** పిలిచేవారు. వీరు చక్రవర్తిచే నియమించ బడి ఆయన ఆసీసులు పొందినంత కాలం పదవిలో కొనసాగే వారు. అయితే కేంద్ర స్థాయిలో చక్రవర్తి లాగానే రాష్ట్రస్థాయిలో ఈ పాలకులు కూడా చాలా స్వతంత్రంగా వ్యవహరించేవారు. సైన్యాన్ని పోషించుకుని తమ ఆధీనంలోని ప్రాంతములో శాంతిభద్రతలను కాపాడడంతో పాటు, చక్రవర్తికి అవసరమైనప్పుడు సహాయం చేయడం వీరి విధులలో ముఖ్యమైనవి.

**వలనాడు లేదా సీమలు:** పాలనా సౌలభ్యం కొరకు విజయనగర పాలకులు రాష్ట్రాలను సీమలు లేదా వళనాడులుగా విభజించారు. వీటిపై అధికారులుగా **"పారుపత్య దారులు"** వుండేవారు.

**సమితులు లేదా స్థలములు:** వలనాడు లు లేదా సీమలను తిరిగి స్థలములు లేదా సమితి అనే విభాగాలుగా విభజించారు. వీటిపై **గౌడ లేదా గండ లేదా కరణం** మొదలగువారు అధికారులుగా వ్యవహరించేవారు.

**గ్రామాలు:** విజయనగర సామ్రాజ్య పాలనాకాలంలో చివరి పాలనా విభాగం గ్రామాలు. నాడు గ్రామాలు మూడు రకాలుగా ఉండేవి. అవి **బండార వాడ, అమర గ్రామం, అగ్రహారం**. బండారు వాడ పాలనకు **రాజఉద్యోగులు**, అమర గ్రామాలకు అమర నాయకులు, అగ్రహారాలకు <u>విద్వాన్ మహాసభలు</u> పాలించేవారు. గ్రామ కార్యక్రమాలు చూసేందుకు అన్ని రకాల గ్రామాలపై <u>ఆయగాండ్రు</u> లేదా <u>ఆయగాల్లు</u> అనే ఒక ప్రత్యేక వ్యవస్థ విజయ నగర పాలకుల చే నియమించబడింది. **పురోహితుడు, రెడ్డి,కరణం, తలారి** మొదలగు ఉద్యోగులు అందులో ఉండేవారు. వీరికి విజయనగర పాలకులు మిరాశీ భూములన అప్పగించగా , వాటినుంచి వచ్చే ఆదాయము ను వారే అనుభవించేవారు .

**నాయంకర విధానం:**

విజయనగరచక్రవర్తుల కాలంలో విశిష్టమైన అంశం అమర నాయంకర విధానం. వాస్తవంగా విజయనగర చక్రవర్తులు సైనిక పాలన నిర్వహణలో సమర్థులుగా పేరుపొందడానికి ఈ అమర నాయంకర విధానం ఎంతో దోహద పడింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. <u>అమర నాయంకరులు</u> అనగా రెవెన్యూ గ్రాంటును వసూలుచేసే అధికారులు అని అర్థం. ఇందులో <u>అమర</u> అనగా <u>రెవిన్యూ గ్రాంట్</u>, <u>నాయక</u> అనగా <u>సైనికాధికారి</u>, <u>కారా</u> అనగా <u>పదవి</u> అని అర్థం. అంటే నిర్ణీత మొత్తమును చక్రవర్తికి చెల్లిస్తూ, సైన్యాన్ని పోషించు అధికారి అని అర్థం. వాస్తవంగా రాజ్యానికి విశిష్ట సేవలు చేసిన ప్రభుత్వ ఉద్యోగులను లేదా చక్రవర్తి పట్ల విశ్వాసంగలవారిని ఈ పదవులలో విజయనగరచక్రవర్తులు నియమించేవారు. నిర్ణీత- మొత్తంను చక్రవర్తికి చెల్లిస్తూ వారి ఆధీనంలోని ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడడం వీరి ప్రధాన విధిగా చెప్పుకోవచ్చు. చక్రవర్తికి అవసరమైనప్పుడు సైనిక సహాయం చేయడం వారి విధుల్లో ముఖ్యమైనది. చక్రవర్తిని ఒప్పించడానికి అనేక సందర్భాలలో వీరు తగిన బహుమతులు ఇచ్చేవారు. అనగా చక్రవర్తి వివాహ సందర్భాలలో లేదా మరొక ముఖ్యమైన- టువంటి వేడుకలలో చక్రవర్తి యొక్క అభిమానాన్ని పొందడానికి వీరుఅనేక బహుమతులు ఇవ్వాల్సి ఉంది. వీరు తమ ఆధీనంలోని ప్రాంతంలో నేరస్తులను శిక్షించి ,శాంతిభద్రతలను కాపాడడంవీరి ప్రధాన విధి. అమర నాయకులను కొంతమంది చరిత్రకారులు ఐరోపాలోని భూస్వాములతో పోల్చిరి. అయితే అధికారాలలో వీరిద్దరి మధ్య కొన్ని పోలికలు ఉన్నప్పటికీ, ఫ్యూడల్ వ్యవస్థ రాజకీయమైనది వంశపారంపర్యమైనది కానీ అమర నాయంకర విధానం రాజకీయాలతో సంబంధం లేకుండా ఆర్థిక మరియు సైనిక విధులకు సంబంధించింది. అంతేకాకుండా ఈ అమర నాయంకర విధానం భూస్వామ్య వ్యవస్థ లాగా వంశపారంపర్యం కాదు.

**విజయనగరకాలంనాటి సైనిక విధానం:**

"దక్షిణాది హిందువులకు మరియు దక్కన్ మహమ్మదీయ పాలకులకూ మధ్య చెలరేగిన భయంకర సంఘర్షణే విజయనగర చరిత్ర"- కె. ఎన్. శాస్త్రి మరియు యన్. వెంకట రమణయ్య.

విజయనగర చక్రవర్తులు నిరంతరమూ బహుమనీ సుల్తాను పాలకులచే పోరాడవలసి రావడంతో వారుసైనిక రాజ్యమును తప్పనిసరి పరిస్థితుల్లో ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. అందుకనే వారికి వచ్చేటువంటి ఆదాయంలో సైనిక రంగ నిర్వహణకు దాదాపు అర్ధ భాగాన్ని వారు ఖర్చు చేసేవారు. శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి సైనిక విధానమును మిగతా పాలకులు కూడా దాదాపు పాటించారని చెప్పవచ్చును.

విజయనగరచక్రవర్తుల కాలం నాటి సైన్యమును రెండు విభాగాలుగా విభజించవచ్చును అందులో మొదటిది చక్రవర్తి సైన్యం. చక్రవర్తి సైన్యం ఎన్నిక, శిక్షణ మరియు యుద్ధకాలంలో నిర్వహణ, చక్రవర్తి లేదా దండ నాయకులుచే నిర్వహించబడును. ఈ వ్యవస్థను కందాచార శాఖ పర్యవేక్షణలో విజయనగర పాలకులు కొనసాగించారు. వీరు చతురంగబలాలు, నౌకాబలం, అశ్వికబలంతో పాటు, కాల్బలము సేవలను కూడా వినియోగించుకొనిరి. మేలురకం అశ్వములను ఇరాన్, పర్షియా, పోర్చుగీస్ ప్రాంతాలనుంచి వారు దిగుమతి చేసుకునే వారని మనకు ఆధారాల వల్ల తెలుస్తోంది,

**అమరనాయంకర సైన్యం:**

విజయనగర పాలనాకాలం నాటి సైన్యంలో మరొక ముఖ్యమైన అంశం మరియు విజయనగర చక్రవర్తులు అపారవిజయాలు సాధించడానికి కారణమైంది అమరనాయంకర సైన్యం. అమర నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక సైనిక పటాలములు, కఠోర సైన్యము, క్రమశిక్షణతో కూడిన పద్ధతులతో పోషింపబడేది. స్థానిక భద్రతలను కాపాడడంతో పాటు విదేశీ దండయాత్రల కాలంలో చక్రవర్తి ఆదేశాల మేరకు పనిచేసి విజయనగర సామ్రాజ్య పటిష్టతకు ఎంతో శ్రమించాల్సి రావడం వీరి యొక్క ప్రధాన విధి. ఈ సైన్యం ఎన్నిక, సైన్యం శిక్షణ మరియు యుద్ధ కాలంలో సైన్యాన్ని నిర్వహించే బాధ్యత అమరనాయకులు చూసుకునేవారు. వీరు ప్రముఖ కొండ జాతి ప్రజలయిన తులు, కబ్బలి, మొరస, కోయలు, చెంచులు మొదలగువారిని సైనికులుగా నియమించి వారి శౌర్య, పరాక్రమాలతో అనేక విజయాలను విజయనగర సామ్రాజ్యానికి సాధించిపెట్టారు. బాకులు, డాలు, గండ్రగొడ్డలి, ధనుర్బాణాలు లాంటి ఆయుధములను విజయనగర చక్రవర్తులు యుద్ధ కాలంలో ఉపయోగించేవారు.

**దుర్గముల ఏర్పాటు**:

విజయనగరచక్రవర్తుల కాలంలో సైనిక పటిష్టతకు కారణమైన మరొక్క అంశం దుర్గముల ఏర్పాటు. కీలకమైన ప్రాంతాలలో అనేక దుర్గములను నిర్మించి వాటిని దుర్గ దండనాయకులు ఆధీనంలో ఉంచేవారు. కావున నాటి బహుమనీపాలకుల నుంచి ఎన్ని సమస్యలు, దండయాత్రలు ఎదురైనప్పటికీ విజయనగర పాలకులు ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు అనేక ఘనవిజయాలను సాధించారు.

**న్యాయ విధానం:**

విజయనగరసామ్రాజ్యం మొత్తానికి న్యాయాధిపతి చక్రవర్తి. అయితే న్యాయరంగంలో సలహా ఇవ్వడానికి "ప్రాడ్వివాకులు" అనే ఉద్యోగ వ్యవస్థ ఎంతో సహాయపడేది. విజయనగర కాలంలో రెండు రకాల న్యాయస్థానాలు ఉండేవి. అవి "ధనోద్భవ న్యాయస్థానము" మరియు "హింసోద్భవ న్యాయస్థానాలు". ధనోద్భవ న్యాయస్థానాలు సివిల్ వ్యయాహారాలను, హింసోద్భవ న్యాయస్థానాలు క్రిమినల్ కేసులను విచారించేవి. రాష్ట్రస్థాయిలో రాష్ట్ర గవర్నర్లు మరియు ఇతర నాయకులు న్యాయ నిర్వహణ చేసేవారు. రెండు లేదా మూడు గ్రామాలకు ఒక

“ధర్మాసనం” అనే స్థానం నెలకొల్పబడింది. ఈ ధర్మాసనాలు సివిల్ మరియు క్రిమినల్ కేసులను ప్రత్యేకంగా విచారించిశిక్షించేవారు.

గ్రామస్థాయిలో గ్రామసభలు కేసులను విచారించి న్యాయం చెప్పేవారు. గ్రామాలలో తలారి కొన్ని గ్రామాలపై కావలిగార్లు, పర్వతప్రాంతాలు లేదా అరణ్య ప్రాంతాలలో పాలెగాళ్ళు, పట్టణాలలో పేటకావలిగార్లు పర్యవేక్షణ చేసి నిరంతరం శాంతి భద్రతలను పరీక్షిస్తూ విజయనగరసామ్రాజ్య సైనిక పటిష్టతకు ఎంతో కృషి చేసారు. అనగా నేటి పోలీస్ విధులను వారు నిర్వహించేవారు. వీరికి ప్రత్యేకంగా ప్రభుత్వం జాగీర్లను కేటాయించగా అందులో నుంచి వచ్చే ఆదాయముతోనే వారు జీవనం కొనసాగించారు. దొంగలను పట్టుకోవడంలో విఫలమైన ఉద్యోగులు ఆర్థికనష్టములను భరించవలసిఉండును.

**ప్రభుత్వ ఆదాయ వ్యయ విధానం:**

విజయనగర సామ్రాజ్యం అధిక మొత్తంలో సైనిక నిర్వహణకు వ్యయం చేయవలసి వచ్చినప్పటికీ, సామ్రాజ్యం సిరిసంపదలతో, ఆర్థిక సౌభాగ్యాలతో విరాజిల్లేదని మనకు తెలుయుచున్నది.

**ప్రధాన ఆదాయ వనరులు**:

సామంతులు చెల్లించే కప్పములు, రాష్ట్రపాలకులు, అమరపాలకులు చెల్లించే పన్నులు, భూమిశిస్తు, భాండారవాడలపై వచ్చు ఆదాయమే వారికీ ప్రధాన ఆదాయవనరులు.

**భూవిభజన**:

రైతుకు సరైన న్యాయం అందించుటకు, పన్ను విధించుటలో జరిగే లోపాలను సరిదిద్దుటకు విజయనగర పాలకులు, నాటి భూమిని మెట్ట మరియు మాగాణి అనే రెండు రకాలుగా విభజించిరి. భూమిని కొలుచుటకు కేసర పాటిగడ, దొరగడ మొదలగు సాధనములను వారు ఉపయోగించిరి. మెట్ట భూములు అనగా వర్షాధారమైనవి. మాగాణి భూములు అనగా చెరువు, బావుల కింద నీటి ఆధారంగా పండించే భూములు. భూమిశిస్తు అధికంగా ఉండేదని చెప్పవచ్చును. వృత్తిపన్ను, టంకం, హోన్స్, వరాహము, చిన్నములాంటి నాణెములు నాడు వాడుకలో ఉండేవి. భూమిశిస్తుతో పాటు వృత్తి పన్నులు, బీడు భూములపై పుల్లరి పన్ను, చెరువు మేర, దుర్గనివర్తనము, కావలి కట్నం మొదలగు పన్నులను కూడా విజయనగర పాలకులు ప్రజల నుంచి వసూలు చేసేవారు. వాటితో పాటు మంగలి, చాకలి, వైశ్యులు, సాలె వాళ్ల నుంచి కూడా వృత్తి పన్ను వసూలుచేశారు. వేశ్యలనుంచి నుంచి కూడా వారు పన్నులు వసూలు చేయడం గమనార్హం.

**వ్యయ విధానము:**

సైన్య పోషణ, అంతఃపుర వ్యయము, దేవ బ్రాహ్మణ విద్యాసంస్థల పోషించుటకు విజయనగర పాలకులు వారి ఆదాయం నుంచి వ్యయము చేయవలసి వచ్చింది.

పైవిధంగా విజయనగర పాలకులు ప్రజానురంజకంగా, పాలించిరనడంలో సందేహం లేదు.